

చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, కృష్ణారావు

బోనాల ఏర్పాట్లకు చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం బోనాల పండుగ సందర్భంగా ఆలయాల్లో సదుపాయాల కోసం తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను బుధవారం చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వవిప్ ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆలయాల కమిటీ ప్రతినిధులకు రూ.37 లక్షలా 40 వేల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, మందాడి శ్రీనివాస్‌రావు, సబీహా గౌసుద్దీన్, శిరీష, బాబురావు, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



గోపీకృష్ణకు నియామకపత్రం అందజేసి శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

బాలాజీనగర్ డివిజన్

బీజేపీ ప్రధాన కార్యదర్శిగా గోపీకృష్ణ

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బాలాజీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా కర్ర గోపీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్ సమక్షంలో గోపీకృష్ణకు నియోజకవర్గ కన్వీనర్ శ్రీకర్‌రావు నియామకపత్రం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, సూర్యారావు, శేఖర్, రాము, జగదీష్, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, సన్నీ, వీరగంటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హరినగర్‌లో ఉచిత వైద్య శిబిరం



కార్పొరేటర్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అల్లాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ హరినగర్‌లో ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పలు వైద్య పరీక్షలు బుధవారం అందించారు. ఓ ప్రముఖ్య వైద్య ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో నర్సింహ, జ్ఞానేశ్వర్, రత్నం, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్‌చైర్‌పర్సన్‌కు అభినందనల వెల్లువ



శారదకు శుభాకాంక్షలు తెలిపిన మహిళా నేతలు

బాలానగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బుధవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకులు బుద్ధభవన్‌లోని ఆమె కార్యాలయానికి వెళ్లి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొండకింది పుష్పారెడ్డి, దుర్గారాణి, కూకట్‌పల్లి ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఆర్.రమాదేవి శారదను కలిసిన వారిలో ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

షాపూర్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు శస్త్రచికిత్స నిమిత్తం రూ.2.50 వేల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ షాపూర్‌నగర్‌లోని తన నివాసం వద్ద బాధిత కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్, శ్రీరాంనగర్‌కు చెందిన ఆశ యాలిగర్ అనే మహిళకు మెదడులో రక్తం గడ్డకట్టడంతో శస్త్ర చికిత్స కోసం శ్రీశైలం గౌడ్‌ను ఆశ్రయించగా ఆయన సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించారు.

అర్హులకే రుణమాఫీ అందేలా చూడాలి

షాపూర్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అర్హులకే రుణమాఫీ అందేలా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్ కోరారు. రుణమాఫీకి రేషన్‌కార్డు అడగడం అన్యాయమన్నారు. బుధవారం సూరారంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం పదేళ్ల నుంచి రేషన్‌కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇవ్వాలన్నారు.



కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న సత్యనారాయణ

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతా

షాపూర్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.9 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలు పరిష్కరించామని, ఏమైనా సమస్యలుంటే వాటిని పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. డివిజన్‌ను సమస్యలు లేని విధం గా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సురేష్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువు సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. 35 నుంచి 40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఫాక్స్‌సాగర్ చెరువు సమీపంలో ఉరివేసుకుని ఉండడంతో స్థానికులు. పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అలంకరణలో భెల్‌కాలనీలోని శివాలయం



భెల్ కాలనీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పేట్‌బషీరాబాద్‌లోని ఓ ఆలయంలో క్యూలో నిలబడిన భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో భక్తులు పూజలు ఘనంగా బుధవారం నిర్వహించారు. తెల్లవారుజామునుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మియాపూర్, చందానగర్, మదీనగూడ, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట, కేపీహెచ్‌బీ, భెల్ కాలనీ, పేట్‌బషీరాబాద్, హైదర్‌నగర్, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, అల్లాపూర్, ఆల్విన్ కాలనీ, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉపవాసదీక్షలు విరమించారు. భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అభిషేకాలు.. అర్చనలు.. హోమాలు

భెల్‌కాలనీ: బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్, ఎంఐజీకాలనీల్లోని దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష ఫలపంచామృతాభిషేకం, అర్చనలు, తులసిపూజలు, అభిషేకాలు జరిగాయి. భెల్ ఎంఐజీకాలనీలోని సీతాసమేత శ్రీరామచంద్రస్వామికి విశేష అభిషేకాలు జరిగాయి.

- పేట్‌బషీరాబాద్: నియోజకవర్గంలో ఉన్న దేవాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. కుత్బుల్లాపూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, హెచ్‌ఎంటీకాలనీ, జగద్గిరిగుట్ట, ఆదర్శనగర్, నిజాంపేట్ కార్పొరేషన్‌లోని బండారి లే-అవుట్, రోడ్డు నెం.8లోని అభయాంజనేయ స్వామి ఆలయం, అంగడిపేట, వేంకటేశ్వరస్వామి ఆలయాలు, రామాలయాల్లో భక్తులు ఉదయం నుంచే పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.
- హైదర్‌నగర్: హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాల్లో పూజలు చేసేందుకు బారులు తీరారు.



పేట్‌బషీరాబాద్ ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు



వివేకానందనగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బారులు తీరిన భక్తులు



హెచ్‌ఎంటీహిల్స్‌లోని సీతారామాంజనేయ దేవస్థానంలో ఏకాదశి వ్రతంలో పాల్గొన్న దంపతులు



పేట్‌బషీరాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు



ఉషాముళ్లపూడి రోడ్ తులసివనం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న చిన్నారి



కేపీహెచ్‌బీకాలనీలో..



బాలానగర్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

జయదుర్గ మైసమ్మతల్లి దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక

హైదర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జయదుర్గ మైసమ్మతల్లి దేవస్థానం నూతన కమిటీ సభ్యులకు శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ నియామకపత్రాలు బుధవారం అందజేశారు. చైర్మన్‌గా కూన సత్యంగౌడ్, సత్యనారాణముదిరాజ్, ఎం.కృష్ణారెడ్డి, కె.గోపాలకృష్ణ, సురేష్, శ్రీనివాసరెడ్డి, సదా మహేష్, లహరి, వెంకటమహలక్ష్మికి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కావూరి ప్రసాద్, కొడాలి రవి, రాజిరెడ్డి, వెంకటేష్, వాసు, రామకోటేశ్వరరావు, శ్రీనివాస్‌రావు, రాజేంద్రప్రసాద్, వెంకట్‌రావు, కొఠారి వెంకట్, ఎస్‌వీ రావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

నిజాంపేట్ కార్పొరేషన్ స్థలం కబ్జాకు ప్రయత్నం

● ఎమ్మెల్యే అండదండలతోనే.. ● బీజేపీ నాయకుడు సతీష్ ఆరోపణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల సతీష్

నిజాంపేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కోసం కేటాయించిన 100 కోట్ల విలువ చేసే 4.19 ఎకరాల స్థలాన్ని కాజేయడానికి కొందరు వ్యక్తులు ప్రణాళిక చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆకుల సతీష్ విలేకరుల స మావేశంలో బుధవారం వెల్లడించారు. నిజాంపేట్ ప్రాంతంలోని సర్వేనెంబర్ 233/1, 3లో ఉన్న ఈ స్థలాన్ని స్థానిక మేయర్ భర్త సర్వేనెంబ 186గా మార్చి ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూరేలా ప్రయత్నిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఈ కార్యాలయం నిర్మాణానికి 10 లక్షల రూపాయలు కేటాయించి శంకుస్థాపన చేసి దాని కార్యాలయ నిర్మాణానికి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సతీష్ ఆరోపించారు. కొందరు వ్యక్తులు 59 జీవో కింద దరఖాస్తు చేసుకుని ఈ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులను కోర్టు లో కౌంటర్ దాఖలు చేయకుండా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అండదండలతోనే ఈ కబ్జా బాగోతం సాగుతోందని ఆయన ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి, అరుణ్‌కుమార్, కవిత రెడ్డి, మాధవరావు, కుమార్‌గౌడ్, ఎల్లస్వామి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైకు దొంగ అరెస్టు, 2 బైకులు స్వాధీనం

అల్లాపూర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ లో నివాసం ఉండే సయద్ జావిద్(57) వృత్తిరీత్యా లారీ డ్రైవరు. అల్లాపూర్, బోరబండ ప్రాంతాల్లో రాత్రి పూట సంచరిస్తూ ఇళ్ల ముందు పార్క్ చేసిన బైకులను చోరీ చేస్తున్నాడు. అలా దొంగిలించిన మోటార్‌సైకిళ్లను విక్రయిస్తూ వచ్చి న డబ్బుతో జల్సాగా తిరుగుతుంటాడు. ఇటీవల టీఎస్ 12 ఈఎ 8571 నెంబర్ గల బైకు చోరీకి గురయిందని ఫిర్యాదు రావడంతో అల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడు సయ్యద్ జావిద్ వద్ద బైకు లభించిందని అల్లాపూర్ సీఐ వెంకటరెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి మరో బైకును స్వాధీనం చేసుకున్నారు. బైకు దొంగను పట్టుకునేందుకు అల్లాపూర్ పోలీసుల బృందం కృషికి కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు అభినందించారు.



సయద్ జావిద్

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మోసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు

రాయదుర్గం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సంధ్య కన్‌స్ట్రక్షన్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న కొమ్మారెడ్డి ఠాగూర్, మాలికిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి తనను మోసం చేశారంటూ సంధ్య కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్ యజమాని శ్రీధర్‌రావు రాయదుర్గం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గం పరిధిలోని సంధ్యా టెక్నో 1 కమర్షియల్ బిల్డింగ్‌లో 2021లో మాలికిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మొదటి అంతస్తు కొనుగోలు చేశారు. కానీ ఐదు అంతస్తుల బిల్డింగ్ మొత్తం కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడని శ్రీధర్‌రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కొమ్మారెడ్డి ఠాగూర్, మాలికిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మాలికి వీరభద్రరెడ్డి, సీఏ దాట్ల రామరాజు, హరీష్, గణేష్, ఈశ్వర్, వెంకట్‌లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జెరిపేటి జైపాల్‌ను సన్మానిస్తున్న ఉరిటి యువసేన సభ్యులు

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్‌కు ఘనంగా సన్మానం

చందానగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జెరిపేటి జైపాల్ తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉరిటి వెంకట్రావ్ ఆధ్వర్యంలో ఉరిటి యువసేన సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

చిట్టీ వ్యాపారి వేధింపులు.. యువకుడి ఆత్మహత్య



రవికుమార్ (ఫైల్)

గాజులరామారం, జూలై 17(ఆంధ్రజ్యోతి): చిట్టీ వ్యాపారి వేధింపులు తట్టులేక ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కృష్ణకాలనీకి చెందిన పి.రవికుమార్ (27) జూబ్లీహిల్స్‌లో టీ స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రవికుమార్, అతడి స్నేహితుడు కలిసి ఓ చిట్టీ వ్యాపారి వద్ద రూ.5 లక్షల చిట్టీ వేసి ఎత్తు కున్నారు. చిట్టీ ఎత్తుకుని కొన్ని నెలలు సక్రమంగా డబ్బు చెల్లించాడు. ఈ క్రమంలో కొద్ది నెలలుగా చిట్టీ డబ్బులు చెల్లించడం లేదు. దీంతో చిట్టీ యజమాని రవికుమార్‌ను డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతోనే మనస్తాపం చెందిన రవికుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

చిట్టీ యజమాని ఒత్తిడితోనే మా కొడుకు చనిపోయాడు

'వ్యాపారి వద్ద మా అబ్బాయి చిట్టీ వేసినట్లు అతనే వచ్చి మాకు చెప్పే వరకూ తెలియదు. ఈ మధ్య కాలంలో చిట్టి వ్యాపారి వేధింపులు ఎక్కువయ్యాయని రవికుమార్ పలుమార్లు మాకు తెలిపి వాపోయాడు. ఇంతలోనే ఏమైందో, ఏమో కానీ మా కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. చిట్టి వ్యాపారి వేధింపులతోనే మా అబ్బాయి చనిపోయాడు' అని మృతుడి కుటుంబసభ్యులు స్థానికుల ముందు వాపోయారని తెలుస్తుంది. ఇంతవరకూ రవికుమార్ కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ మోతీలాల్ తెలిపారు.

● ఫ్లై ఓవర్‌పై ప్రమాదకరంగా ఫ్లెక్సీలు



షేక్‌పేట వంతెనపై ఓ పార్టీ నాయకుడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. వంతెనపై ఉన్న విద్యుత్ స్తంభాలకు కట్టిన ఫ్లెక్సీలు గాలికి ఊడిపడ్డాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే ఓ నెటిజన్ ఆ ఫొటోలను ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ, ఈవీడీఎం అధికారులను కోరాడు.

అధిక లాభాల ఆశ చూపి వ్యక్తికి టోకరా

రూ.3.06 కోట్లు దండుకున్న కి'లేడీ' అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని మోసం చేసి అతడి నుంచి రూ. 3.06 కోట్లు కాజేసిన కిలాడీ లేడీని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్టు చేశారు. శేరిలింగంపల్లి, నల్లగండ్ల ప్రాంతానికి చెందిన పానుగంటి ఇందిరాదేవిరెడ్డి(29) అలియాస్ ఇందిరాదేవి కొన్నేళ్లుగా మోసాల బాట పట్టింది. ఓ ఎన్నారైగా బిల్డప్ ఇస్తూ.. బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసింది. నాగోల్‌లో దేవి ఫుడ్స్ పేరిట ఓ ఫుడ్ ఇండస్ట్రీ కూడా ఉందని నమ్మించింది. నార్సింగి, మాదాపూర్, గచ్చిబౌలిలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీల్లో తనకు ఎన్నో విల్లాలు, ఆస్తులున్నాయని, నాగోల్‌లో ఓ అపార్టుమెంట్ కూడా ఉందని బురిడీ కొట్టించింది. మదీనాగూడకు చెందిన ఎస్. సత్యనారాయణతో పరిచయం పెంచుకున్న ఆమె తన వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించింది. సత్యనారాయణ రూ. 3.06కోట్లు పెట్టుబడి పెట్టాడు. బాధితుడికి సంబంధించిన రెండు కార్లను కూడా తీసుకెళ్లి తనఖా పెట్టింది. ఇద్దరు స్నేహితులను తీసుకొచ్చి పోలీసు అధికారులుగా పరిచయం చేసి వారికి రెండు ఐఫోన్‌లు, వన్‌ప్లస్ ఫోన్‌లు సత్యనారాయణతో కొనుగోలు చేయించి తీసుకుంది. మోసపోయానని గ్రహించిన బాధితుడు డబ్బు, కార్లు తిరిగి ఇవ్వమని ఆమెను అడిగాడు. డబ్బు విషయం మరిచిపోవాలని, అడిగితే తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బ్లాక్‌మెయిల్ చేయసాగింది. బాధితుడు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహిళను అరెస్టు చేసి ఆమె నుంచి రెండు కార్లు, 3 ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.